ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

మంగళవారం 3 డిసెంబరు 2024



## కరాటే పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ చిప్ప భాస్కర్ తెలిపారు. హన్మంకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఎంఆర్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో బ్రాహ్మణపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొని గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వారిని పాఠశాల కరస్పాండెంట్ చిప్ప భాస్కర్, ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు, బీఎంఆర్ అకాడమీ ఫౌండర్ బండారి సంతోష్ అభినందించారు.

## పత్తిపాక రిజర్వాయర్‌తో భూములు సస్యశ్యామలం

**- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు**

ఎలిగేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పత్తిపాక లక్ష్మీనరసింహ రిజర్వాయర్‌తో 2.40లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం మండలంలోని శివపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో పత్తిపాక ప్రాజెక్టు ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపాక రిజర్వాయర్‌ను రూ.2,950 కోట్ల వ్యయంతో ఐదు టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం గల ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపిందన్నారు. రిజర్వాయర్ వల్ల చొప్పదండి, పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాల్లోని రైతులకు ప్రత్యేక్షంగా 15వేల ఎకరాలు, పరోక్షంగా 2.40లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తుందని తెలిపారు. అధికారులు త్వరగా రిజర్వాయర్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సాగునీటి ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ నాయకులు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం మండలంలోని గంగారం బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు, సింగిల్‌విండో డైరెక్టర్ ముస్కు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కూస సతీష్, మాజీ వార్డు సభ్యుడు ఆవుల తిరుపతి, మేడి శంకర్, నాయకులు ముష్కె రాజ్‌కుమార్, కొనుకటి శ్రీకాంత్, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక ఇప్పటివరకు సుమారు 60వేల ఉద్యోగాలు కల్పించామన్నారు. రైతులకు రుణమాఫీ, మద్దతు ధర కల్పించి, రైతుల ఖాతాల్లో బోనస్ జమచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు ఎండీ మునీర్, ఈద సత్యనారాయణరెడ్డి, బాలే సమ్మయ్య, మేడి అశోక్‌గౌడ్, నేదురు రమేష్, ఆవుల రాములు, రాణవేన రవీందర్, కాల్వ వేమారెడ్డి, నోముల కిరణ్, రానవేన రామస్వామి, బండారి సంపత్ పాల్గొన్నారు.

## నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం మంగళవారం ఉదయం 11 గంటల 35 నిమిషాల నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా సదరం సర్టిఫికేట్ కావాల్సిన వారు, రెన్యువల్ కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. డిసెంబరు 5 పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో, 12వ తేదీన గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో నిర్వహించే సదరం క్యాంప్‌లో శారీరక అంగ వైకల్యం గలవారు, మానసిక అంగ వైకల్యం, బుద్ధి మాన్యం ఉన్న వారు, డిసెంబరు 19న పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో, 27న గోదావరిఖని జనరల్ ఆస్పత్రిలో నిర్వహించే క్యాంప్ కోసం దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులు మంగళవారం ఉదయం 11 గంటల 35 నిమిషాలకు మీ సేవా కేంద్రాల్లో స్లాట్ నమోదు చేసుకోవాలని సూచించారు.

## వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న తొమ్మిది వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న ఆరు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్, మూడు సివిల్ అసిస్టెంట్ సర్జన్ (ఎంబీబీఎస్) పోస్టుల నో కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈ నెల 10న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వైద్యులు తమ దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులు ఒక సెట్‌తో హాజరు కావాలన్నారు. గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్, జనరల్ మెడిసిన్, మత్తు వైద్య నిపుణులకు మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు లక్ష రూపాయలు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు నెలకు 52,351 రూపాయల వేతనం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9494853396 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

# సర్కారు వైద్యంపై భరోసా

- పెద్దపల్లి ఆస్పత్రికి పెరుగుతున్న ఆదరణ
- నెలలో 10,539కి పెరిగిన ఓపీ
- పది రోజుల్లో 18 మందికి కంటి శస్త్ర చికిత్సలు
- ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలని వినతి



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి.. ఒకప్పుడు సర్కారు దవాఖానాకు రావాలంటే ఆలోచించే ప్రజలు ఇప్పుడు పెద్ద ఎత్తున వస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. రోగులకు తగ్గట్టుగా అధికార యంత్రాంగం వసతులను కల్పిస్తుండడంతో సర్కార్ దవాఖానపై ప్రజల్లో విశ్వాసం నెలకొంటున్నది. మాతా శిశు కేంద్రంలోనూ ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. ఐదు నెలల క్రితం కలెక్టర్‌గా వచ్చిన కోయ శ్రీహర్ష విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని పెద్దపల్లి, గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్ ఆసుపత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తరుచూ సందర్శిస్తూ అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నారు. డాక్టర్లు సమయానికి వచ్చి వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని సస్పెండ్ చేశారు. ఆసుపత్రిలో ఏఎన్‌ఎంలు సరిపోకుంటే ఔట్ సోర్సింగ్ ప్రాతిపదిక 16 మందిని నియమించారు.

**● కంటి శస్త్ర చికిత్సలు ప్రారంభం..**

పెద్దపల్లిలో కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. గత ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించినప్పుడు ఇక్కడే శస్త్ర చికిత్సలు చేసేందుకు కావాల్సిన పరికరాల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాలేదు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ చొరవ తీసుకోవడంతో సర్జరీలకు అవసరమైన పరికరాలు సమకూరాయి. దీంతో నవంబరు 22 నుంచి శస్త్రచికిత్సలు ప్రారంభించారు. పదిరోజుల్లో 18 మందికి శస్త్ర చికిత్సలు చేశారు.

**● 1,289 మంది ఇన్ పేషంట్లు**

నాలుగు నెలల క్రితం పెద్దపల్లి ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య 300 నుంచి 500 మంది వరకు ఉండేది. గడిచిన నవంబరు నెలలో 10,539 మంది చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చారు. 1,289 మంది రోగులకు ఆసుపత్రిలో చేర్చి వైద్యం అందించారు. మాతా శిశు కేంద్రానికి5,088 మంది వచ్చారు. పరిస్థితిని బట్టి 667 మంది ఆసుపత్రిలో చేర్చి డాక్టర్లు వైద్య సేవలు అందించారు. ఒకే నెలలో 210 మంది గర్భిణులకు ప్రసవం నిర్వహించారు. అవసరం ఉన్న వారికి సర్జరీ చేశారు. ఆసుపత్రిలో ఆర్థో సర్జరీలు పెరిగాయి. ఆగస్టులో 29 మంది, సెప్టెంబరులో 40 మంది, అక్టోబరులో 51 మంది, నవంబరు నెలలో 55 మంది రోగులకు ఆర్థో సర్జరీలు చేశారు. నవంబరులో 25 మందికి ఈఎన్‌టీ, 22 మందికి సాధారణ ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే సుల్తానాబాద్ మండలం చిన్న కల్వల గ్రామానికి చెందిన 96 ఏళ్ల వృద్ధురాలు పందిర్ల బాలమ్మకు తుంటి ఎముక విరగగా, ఆర్థో డాక్టర్లు కుమార్, శ్రీనివాస్, శౌరయ్య రిస్క్ తీసుకుని విజయవంతంగా ఆపరేషన్ చేశారు. అలాగే కాళ్లు వంకరగా పుట్టిన ఆరుగురు నవజాత శిశువులకు 'పాన్‌సెట్టి కాస్టింగ్' ఆపరేషన్లు నిర్వహించారు.

**● 100 పడకలకు పెంచాలని..**

పెద్దపల్లి ఆసుపత్రిలో గల 50 పడకలు మాత్రమే ఉన్నాయి. జ్వరాల సీజన్‌లో పడకలు సరిపోవడం లేదు. పెద్దపల్లి జిల్లా కేంద్రం కావడంతో ఆసుపత్రిని 100 పడకలకు..

మిగతా 8వ పేజీలో....

# సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాల్గొనే సభా ప్రాంగణం వద్ద విద్యుత్ సరఫరాకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. లక్ష మంది ప్రజలతో భారీ బహిరంగ సభ డిసెంబరు 4న సాయంత్రం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరుగుతుందన్నారు. అవసరమైన విద్యుత్ తదితర పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. పార్కింగ్ వద్ద అవసరమైన లైటింగ్ ఉండేలా చూడాలని, కార్యక్రమ నిర్వహణకు వీలుగా అవసరమైన లోడ్, డిమాండ్ తట్టుకునేలా ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు, ఆర్డీవో గంగయ్య, కమిషనర్ వెంకటేష్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఈఈఆర్‌బీ బావ్ సింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**● సీఎం సభకు సమన్వయంతో బందోస్తు**

కోల్‌సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 4న జరగనున్న ముఖ్యమంత్రి సభకు అధికారులు సమన్వయంతో బందోబస్తు నిర్వహించాలని, కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. సోమవారం కమిషనరేట్‌లో డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలతో బందోబస్తు ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, వీఐపీలు వచ్చే మార్గాల గురించి, ప్రజల రాకపోకల సౌకర్యం తదితర విషయాలపై సీపీ సమీక్ష జరిపారు. వివిధ శాఖల సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, ఫైర్‌సర్వీస్ గురించి సమన్వయం చేసుకోవాలన్నారు. స్పెషల్ టీముల ఏర్పాటు గురించి సమావేశంలో చర్చించారు. సమీక్ష సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

## ఏపీ జూనియర్ సివిల్‌జడ్జిగా మొగురం గాయత్రి



జూలపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్‌కు చెందిన నిరుపేద కుటుంబం మొగురం మొండయ్య-లక్ష్మి దంపతుల కూతురు మొగురం గాయత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జూనియర్ సివిల్‌జడ్జిగా ఎంపికయ్యారు. గాయత్రి వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ, ఉస్మానియా యూనిర్సిటిలో ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైకోర్టు నిర్వహించిన సివిల్‌జడ్జి పరీక్షలో ప్రతిభ కనబరిచి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. కాగా గాయత్రి తండ్రి మొండయ్య పశువులను కాస్తూ, గ్రామంలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గాయత్రి జూనియర్ సివిల్‌జడ్జిగా ఎంపికవ్వడంతో కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఎయిడ్స్‌పై ర్యాలీ

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైద్యసిబ్బందితో పాటు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సోమవారం ఎయిడ్స్‌పై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎయిడ్స్‌పై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. డాక్టర్లు మహేందర్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



నర్సింగ్ కళాశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

**వైద్య విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి**

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

7



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

**సీఎం బహిరంగసభను విజయవంతం చేయాలి**

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

8

## తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌కు మొక్క అందజేస్తున్న ఉద్యోగులు

అంతర్గాం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల తహసీల్దార్‌గా తూము రవీందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇటీవల వరకు తహశీల్దార్‌గా పని చేసిన వీ రమేష్ గత నెలలో ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంథని ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేసిన తూము రవీందర్‌ను అంతర్గాం తహసీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తహసీల్దార్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

## బాల మల్లేష్ మృతి తీరని లోటు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భూపోరాట యోధుడు బాల మల్లేష్ మృతి సీపీఐకి తీరని లోటని సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోషిక మోహన్ అన్నారు. సోమవారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గౌతం గోవర్ధన్, కే స్వామి, తాళ్లపల్లి మల్లయ్య, ఓదమ్మ, రమ, తొడుపునూరి నరేష్, శనిగరపు చంద్రశేఖర్, రేణికుంట్ల ప్రీతం తిరుమల, విజయ, రేణుక, రాజమ్మ, చేరాలు పాల్గొన్నారు.

# జిల్లాకు నాలుగు పోలీస్ స్టేషన్ల మంజూరు

- 23 ఏళ్ల తర్వాత ఎలిగేడులో స్టేషన్
- పెద్దపల్లి రూరల్, ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్ల ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర హోంశాఖ




పెద్దపల్లిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎప్పటి నుంచో ప్రతిపాదనల్లో ఉన్న ఎలిగేడు, పెద్దపల్లి రూరల్, పెద్దపల్లి ట్రాఫిక్, పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్లను మంజూరు చేస్తూ సోమవారం రాష్ట్ర హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలో పోలీస్ స్టేషన్ల సంఖ్య 22కు పెరగనున్నది. పెద్దపల్లి జిల్లా కేంద్రం అయిన తర్వాత ఇక్కడ పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌తో పాటు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. పెద్దపల్లి జిల్లా కేంద్రం అయినప్పటికీ పెద్దపల్లి పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఇప్పటికీ ఎస్సై వ్యవహరిస్తున్నారు. కొత్తగా పెద్దపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడంతో పెద్దపల్లికి మరొక సీఐ పోస్ట్ పెరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొనసాగుతున్న రాఘావాపూర్, రంగాపూర్, సబ్బితం కుర్మపల్లి, రాగినేడు, బ్రాహ్మణపల్లి, అప్పన్నపేట, బొంపెల్లి తదితర గ్రామాలు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రానున్నాయి. వీటితో పాటు మండల పరిధిలో ఉన్న గ్రామాలు ఇదే స్టేషన్ పరిధిలో ఉండనున్నాయి. పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషనుకు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా మరొక సీఐ పోస్టును కేటాయించి, పెద్దపల్లి రూరల్, జూలపల్లి, ధర్మారం, బసంత్ నగర్ పోలీస్ స్టేషన్లకు కలిపి రూరల్ సీఐని కేటాయించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకు పెద్దపల్లిలో రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి ఒక సీఐ, ఒక ఎస్సై తోపాటు ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, పలువురు కానిస్టేబుల్‌తో ~ఎ ద~ ~ప ల్లి లో తాత్కాలికంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను నిర్వహిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరు చేయడంతో పాటు సీఐ పోస్టును కూడా మంజూరు చేశారు. జిల్లాలోని మహిళా కేసులన్నీ నూతనంగా ఏర్పడే మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తాయి.

**● నెరవేరనున్న కల..**

2001 జూన్‌లో జూలపల్లి మండలం నుంచి ఎలిగేడు మండలాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఎంపీడీవో కార్యాలయంతో పాటు, తహసీల్దార్, వ్యవసాయ శాఖ, తదితర శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేసినప్పటికీ, పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయలేదు. జూలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఎలిగేడు మండలం కొనసాగుతున్నది. ఇక్కడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు పలుసార్లు ఆయా ప్రభుత్వాలకు నివేదించినప్పటికీ మంజూరు కాలేదు.

2016 అక్టోబరులో పెద్దపల్లి జిల్లా ఏర్పాటు కాగా, పాలకుర్తి, అంతర్గాం, రామగిరి మండలాలను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రామగిరి, అంతర్గాం మండలాలకు కొత్త పోలీస్ స్టేషన్లను మంజూరు చేశారు. అలాగే పాలకుర్తి మండల పరిధిలో అప్పటికే బసంత్ నగర్ పోలీస్‌స్టేషన్ ఉండడంతో దాన్ని ఆ మండల పరిధి కింద కొనసాగిస్తున్నారు. ఇదే సమయంలో ఎలిగేడు మండలానికి పోలీస్‌స్టేషన్ మంజూరు అవుతుందని అంతా ఆశించారు. కానీ గత ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఎమ్మెల్యే విజయరమణారావు చేసిన ప్రతిపాదన మేరకు ఎట్టకేలకు 23 ఏళ్ల తర్వాత ఎలిగేడు మండలానికి పోలీస్‌స్టేషన్ మంజూరు అయ్యింది. దీంతో తమ కల సాకారం అయిందని మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

● కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా అగ్నిప్రమాదం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు చీర కొంగుకు మంటలు అంటుకొని గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు పరిస్థితి విషమించి మృతి చెందింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌కు చెందిన వట్టిల మల్లవ్వ(75) ఓ చిన్న గదిలో ఉంటోంది. ఈ నెల 1న రోజులాగే కింద కూర్చొని కట్టెల పొయ్యిపై వంట చేస్తోంది. ప్రమాదవశాత్తు చీర కొంగు అంటుకొని మంటలు ఒక్కసారిగా ఎగిసి పడ్డాయి. దీంతో వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు చేరుకుని మంటలను ఆర్పి వేశారు. అప్పటికే ఆమె తీవ్ర గాయాలపాలైంది. వెంటనే సిరిసిల్లలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మల్లవ్వకు ఇద్దరు కొడుకులు ఉండగా చిన్న కొడుకు రెండేళ్ల కిందట మృతి చెందాడు.

## తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న లిక్కిడి పద్మ, నర్సింహారెడ్డి ఇళ్లలో ఆదివారం చోరీ జరిగింది. ఎస్సై రమాకాంత్ సోమవారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. పద్మ తన పిల్లలతో కలిసి ఇంటికి తాళం వేసి వీర్నపల్లి మండలం కంచర్లలోని పుట్టింటికి వెళ్లింది. సోమవారం వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులకొట్టి కనిపించాయి. బీరువాను ధ్వంసం చేసి రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలోని ఉచ్చిడి కిషన్‌రెడ్డి ఇంటి తాళం పగులకొట్టిన దొంగలు ల్యాప్‌ట్యాప్, ట్యాబ్, గడియారం చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ వివరించారు.



మల్బరీ ఆకును కత్తిరిస్తున్న పరికరం (ఫైల్)

## మల్బరీ రైతులకు ప్రత్యేక పరికరం

● తోటలో కొమ్మలు కత్తిరించి.. కట్టలు కట్టి ● కూలీల కొరత దూరం ● కొడుముంజ యువకుడి ప్రతిభ

తంగళ్లపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వృత్తి రీత్యా అతడు మోటారు వైండింగ్ మెకానిక్. వ్యవసాయ పనుల్లో రైతుల శారీరక శ్రమ, కూలీల కొరతతో ఎదురయ్యే ఇబ్బందులను గమనించే వాడు. రైతులకు ఉపయోగపడేందుకు పలు పరికరాలు రూపొందించాడు.

ఇందులో భాగంగా మల్బరీ తోటలో కొమ్మలు కత్తిరించి కట్టలు కట్టే పరికారాన్ని తయారు చేసి సెంట్రల్ సిల్క్ బోర్డు ప్రశంసలు అందుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్ గ్రామానికి చెందిన కొడు ముంజ ప్రవీణ్ మోటారు వైండింగ్‌లో ఏడాదిపాటు శిక్షణ పొందాడు. మొదట సైకిల్‌తో కలుపు తీసే యంత్రాన్ని, అనంతరం స్కూటర్ ఇంజన్‌తో కలుపు తీసే యంత్రాన్ని తయారు చేశాడు. పత్తి, కూర గాయలు సాగు చేసే రైతులకు అందుబాటులోకి తెచ్చి కూలీల కొరతను అధిగమించేలా చేశాడు.

అదే స్ఫూర్తితో మల్బరీ కొమ్మలు కత్తిరించి కట్టలు కట్టే పరికరాన్ని రుపొందించాడు. పట్టు పురుగుల పెంపకం కోసం మల్బరీ మొక్కలను పెంచి కొమ్మలను కత్తిరించి వాటిని షెడ్‌లో పెరిగే పట్టు పరుగులకు ఆహారంగా వేస్తారు. ఈ ప్రక్రియలో 15 మంది కూలీలు ఒక్క రోజు చేసే పనిని పరికరం నలుగురు కూలీలతో గంటలో చేయగలదు. సమయం ఆదా అవ్వడంతోపాటు ఖర్చు కూడా తగ్గుతుంది. తక్కువ కూలీలతో ఏ రోజు కత్తిరించిన ఆకులను ఆ రోజు పట్టు పురుగులకు వేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తుండడంతో పరికరం వైపు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

### కేంద్ర పట్టు మండలితో ఒప్పందం

భారత ప్రభుత్వం కేంద్ర పట్టు మండలితో రైతులకు 50 శాతం సబ్సిడీతో పరికరం అందివ్వాడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పరికరానికి సుమారు రూ.2.20 లక్షలు ఖర్చవుతుంది. కేంద్ర పట్టు మండలి ఒప్పందంతో రైతులకు 50 శాతం సబ్సిడీ అందిస్తుండడంతో రూ.1.10 లక్షలకు లభిస్తోంది. సుమారు 20 పరికరాలను తయారు చేసి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని రైతులకు అందించాడు.



### పత్తి, మల్బరీ రైతులకు ఉపయోగం

కొడిముంజ ప్రవీణ్, మిషన్‌రూప కర్త, జిల్లెల్ల

మల్బరీ కొమ్మలు కత్తిరించే మిషన్ మల్బరీ రైతులతో పాటు పత్తి రైతులకు ఉపయోగపడుతుంది.. పత్తి ఏరడం పూర్తయిన తర్వాత పత్తి కట్టె కొట్టడానికి, పశుగ్రాసం కోయడానికి ఉపయోగపడుతుంది. మిషన్ తయారీపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ప్రవీణ్ తయారు చేసిన పరికరం



పరికరాన్ని పరిశీలిస్తున్న కేంద్ర పట్టు మండలి ప్రతినిధులు(ఫైల్)

## మధు మృతదేహం కోసం ఎదురుచూపు

పాలకుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదివారం తెల్లవారుజామున ములుగు జిల్లా ఏటూరునాగారం చల్పాక అటవీ ప్రాంతంలో జరిగిన పోలీస్ ఎదురు కాల్పుల్లో మృతి చెందిన వేగోలపు మల్లయ్య అలియాస్ మధు(47) మృతదేహం రాక కోసం కుటుంబసభ్యులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. సోమవారం ఉదయం మల్లయ్య కుటుంబసభ్యులు ఆయన మృతదేహన్ని గ్రామానికి తీసుకు రావడానికి ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. కానీ మల్లయ్య మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని తెలంగాణ పౌర హక్కుల సంఘం నేతలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మల్లయ్య మృతదేహాన్ని సిట్టింగ్ జడ్జి సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించాలని కోరారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకు రావడానికి కుటుంబసభ్యులకు తోడుగా వెళ్తున్న ఏబీఎంఎస్ నాయకురాలు శాంతను ములుగు పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని పౌరహక్కుల సంఘం నేతలు తీవ్రంగా ఖండించారు.

## సివిల్ సప్లయిూస్ అధికారుల దాడులు

● ఆరు టన్నుల బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్న అధికారులు

కోల్‌సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణాను ఉపేక్షించవద్దని, విస్తృత దాడులు నిర్వహించాలని సివిల్ సప్లై కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశాలతో పౌర సరఫరాల యంత్రాంగం అప్రమత్తమైంది. రేషన్ బియ్యం అక్రమ రవాణా కేంద్రాలపై దృష్టి పెట్టింది. రేషన్ దందాకు డెన్‌గా మారిన గోదావరిఖనిలో సోమవారం సాయంత్రం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గోదావరిఖని రాజేష్ థియేటర్ వద్ద రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యాన్ టీఎస్22టీ8897ను పట్టుకున్నారు. వ్యాన్‌ను సీజ్ చేసి 30క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నారు. వ్యాన్‌ను గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాత్రి 9గంటలకు మార్కండేయకాలనీలోని రేషన్ స్మగ్లర్‌కు చెందిన డంప్‌పై సివిల్‌సప్లై అధికారులు దాడులు చేశారు. రామస్వామి అనే వ్యక్తి ఇంట్లో రేషన్‌బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో ఈ దాడులు చేశారు. మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడుల్లో డీటీసీఎస్‌లు మహేష్, రవీందర్ పాల్గొన్నారు.

## తండ్రీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన తండ్రి కుతురుల పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన తండ్రి కుతురు మల్లవేని నారాయణ(55), శిరీష(22)లు తన ఇంట్లో పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. బంధువులు గమనించి అపస్మారక స్థితిలో ఉన్న వారిని ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. నారాయణ భార్య చాలా సంవత్సరాల క్రితం మృతి చెందింది. వ్యవసాయం చేస్తూ ఒక్కగనొక్క కుతురు శిరీషను పోషిస్తున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ద్విచక్ర వాహనాలు ఢీ : ముగ్గురికి గాయాలు

బీర్‌పూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలో రోడ్డు పక్కన నిలిపిన ద్విచక్రవాహనానికి వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొని ముగ్గురు యువకులు సోమవారం తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి ఇందిరానగర్ వెళ్లే మార్గంలో ఇందిరానగర్‌కు చెందిన ముగ్గురు యువకులు ఒకే వాహనంపై వెలుతున్నారు. గ్రామ శివారు ప్రాంతంలో నర్సింహులపల్లికి చెందిన మంద సుభాష్ రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాన్ని ఆపుకొని ఫోన్ మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన ముగ్గురు యువకులు సుభాష్ వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో ఇందిరానగర్‌కు చెందిన ఇద్దరి యువకులకు, నర్సింహులపల్లికి చెందిన సుభాష్‌కు తీవ్ర గాయాలు కావడంతో జగిత్యా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ద్విచక్ర వాహనాలు దగ్ధం

● అనుమానితుడిని అరెస్టు చేసిన పోలీసులు



దగ్ధం అవుతున్న వాహనాలు

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం వద్ద ఆదివారం అర్ధరాత్రి నాలుగు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దూరు డబుల్ బెడ్ రూం ఇళ్లలోని బ్లాక్ నెంబర్ 33 వద్ద అంకం సందీప్‌కు చెందిన హీరో గ్లామర్, ముత్యాల రాజుకు చెందిన హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ చీరాల ఈశ్వరయ్యకు చెందిన హోండా, మైలారం రామయ్యకు చెందిన టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాలు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని దుండగులు వాహనాలకు నిప్పటించారని బాధితులు ఆరోపించారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు పెద్దూరుకు చెందిన ఆకారపు బాలయ్య అనే వ్యక్తి సంఘటనకు పాల్పడినట్లు సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా గుర్తించి అరెస్టు చేశారు. పెట్రోల్ దొంగతనానికి వచ్చిన బాలయ్య వాహనాల్లో పెట్రోల్ ఎక్కువ లభించలేదని ఆగ్రహంతో దగ్ధం చేసినట్లు పోలీసులు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు

భీమారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో భీమారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన పుప్పాల రచన, చిలువేరి రుచితలు ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ జూనియర్స్ అండర్-19 క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో మధుసూదన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్, పీఈటీ తిరుమలేశ్, మాజీ సర్పంచ్ చెక్కపెల్లి అరుణరఘు, మాజీ ఎంపీటీసీ పల్లి అర్జున్, ఏఏపీ చైర్మన్ డిండిగల లావణ్య, మాజీ ఉప సర్పంచ్ బసవరాజుల రాజు ఉపాధ్యాయులు అభినందించారు.

## అదనపు ఆదాయ మార్గం.. పెరటి కోళ్ల పెంపకం

● ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళల ఆర్థికాభివృద్ధికి పోత్సాహం



హరిదాస్‌నగర్‌లో కోడి పిల్లల షెడ్



బండిలింగంపెల్లిలో పెరటికోళ్లతో లక్ష్మి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరా మహిళాశక్తి పథకం మహిళలకు వరంగా మారింది. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన గ్రామైక్య సంఘం మహిళలు పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం పొందుతున్నారు. ఒక్కో మహిళకు రూ.5,500 బ్యాంకు రుణం అందిస్తోంది. ఆసక్తి ఉన్న మహిళలకు కోడి పిల్లలను అందించి పెంచేలా చర్యలు తీసుకున్నారు. ఆయా గ్రామాల్లోని మహిళలు కోడి పిల్లలను పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. కోడి పిల్లలు ఆరు మాసాల్లో కిలో నుంచి కిలోన్నర బరువు పెరుగుతాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పెరటి కోళ్లకు మంచి డిమాండ్ ఉండడంతో కిలోకు రూ.450 నుంచి రూ.500 వరకు ధర పలుకుతోంది. కిలోన్నర కోడి రూ.700లకు విక్రయిస్తే 50 కోళ్లకు రూ.35 వేల వరకు ఆదాయం వస్తోంది. పెట్టుబడి పోను రూ 25 వేల వరకు మిగులుతాయి.

### 53 మందికి 800 కోడి పిల్లల అందజేత

మండలంలోని పలు గ్రామాలకు చెందిన గ్రామైక్య సంఘం మహిళలను పెరటిలో కోడి పిల్లలను పెంచేలా అధికారులు ప్రోత్సహించారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద రుణం మంజూరు చేసి ఒక్కో మహిళకు 15 నుంచి 20 వరకు 800 కోడి పిల్లలను ఆరు నెలల కిందట అందించారు. పెరటి ఆవరణలో మహిళలు పెంచుతున్న కోళ్ల కిలో నుంచి కిలోన్నర బరువు వరకు పెరిగాయి. పలువురు మహిళలు కోళ్లను విక్రయించారు.

### కోడి పిల్లల పెంపకంతో ఉపాధి

- తిప్పరవేణి ప్రేమలత, హరిదాస్‌నగర్,



హరిదాస్‌నగర్‌లోని శివాజీ గ్రామైక్య సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్నా. రూ. 2 లక్షల బ్యాంక్ రుణం తీసుకుని ఇంటి ఆవరణలో చిన్న పాటి షెడ్డును ఏర్పాటు చేశా. సిద్దిపేట, కామారెడ్డి పట్టణాలను నుంచి ఒక్కో కోడి పిల్లను రూ.34 చొప్పున 800 కోడి పిల్లలను తీసుకొచ్చి షెడ్డులో ఆరు వారాల పాటు పెంచాను. సార్లు గ్రామాల్లోని మహిళలకు ఒక్కో కోడి పిల్లను రూ.100లకు విక్రయించేలా చూశారు. ఆరు వారాలకు సుమారు రూ.80 వేల వరకు ఆదాయం సమకూరుతోంది.

### పెట్టుబడి పోనూ రూ.6 వేలు వస్తాయి

- మాచర్ల లక్ష్మి, బండలింగంపల్లి



బండలింగంపల్లి గ్రామంలోని సంతోషిమాత గ్రామైక్య సంఘంలో గల భగవాన్ స్వయం సహాయక సంఘం సభ్యురాలిని. రూ 3 వేలు స్త్రీ రుణం పొంది 20 కోడి పిల్లలను తీసుకున్నా. మా పెరట్లో నాలుగు నెలల పాటు పెంచా. కిలో బరువు వరకు రాగానే విక్రయిస్తున్నా. పెట్టుబడి పోనూ రూ 6 వేలు మిగులుతాయి.

## ఆలయంలో చోరీ

కోరుట్ల , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయోధ్య పట్టణ ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరి జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఆలయ హుండీ పగులగొటిన గుర్తు తెలియని వ్యక్తులు దాదాపుగా 20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

కోల్‌సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ద్వారకానగర్‌లో నివాసముండే దొంగరి బాలకృష్ణ(38) అనే యువకుడు మద్యానికి బానిసై గత నెల 30న ఇంటి ఆవరణలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. స్థానికులు గమనించి గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతనికి భార్య, కూతురు ఉన్నారు. భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుళ్లకోట గ్రామంలో ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్గటూర్ ఎస్ఐ ఉమాసాగర్ కథనం మేరకు.. గుళ్లకోట గ్రామానికి చెందిన మామిడిపల్లి యాదగిరి (40) 15 ఏళ్లుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా రోగం నయం కావడం లేదని జీవితంపై విరక్తితో ఆదివారం క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు.

మృతుడి భార్య మామి డిపల్లి సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

సుల్తానాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ తన సెల్‌ఫోన్‌ను పోగొటుకోగా పోలీసులు బాధితురాలికి అందజేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం వేగురుపల్లి గ్రామానికి చెందిన రేణుక అనే మహిళ సుల్తానాబాద్ శివారులోని శాస్త్రినగర్ వద్ద గల సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల హాస్టల్‌లో ఉంటున్న తన కూతురును చూడటానికి సోమవారం వచ్చింది. కూతురిని చూసి తిరిగి వెలుతున్న క్రమంలో ఆమె సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. వెంటనే గమనించిన మహిళ 100కు డయల్ చేసి ఫిర్యాదు చేసింది. సుల్తానాబాద్ బ్లూ కోల్ట్స్‌కు చెందిన పోలీసులు రాకేష్, హరీష్ సెల్‌పోన్ కోసం ప్రయత్నం చేసి కనిపెట్టారు. దాన్ని తీసుకుని స్టేషన్‌లో అప్పగించగా ఏఎస్ఐ హన్మంతరావు బాధితురాలికి అందజేశారు.



పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను మహిళకు అందజేస్తున్న పోలీసులు



శిథిలమైన బొమ్మెన ప్రాజెక్ట్ కుడి కాలువ

## బొమ్మెన ప్రాజెక్ట్ కాలువల ఆధునీకరణ ఎప్పుడో..?

● మత్తడి నుంచి వృథాగా పోతున్న నీరు

● చివరి ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం

● రూ. 1.65 కోట్లతో ప్రతిపాదనలు

కథలాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా ఎదురు చూస్తున్నా బొమ్మెన ప్రాజెక్ట్ కాలువ ఆధునీకరణకు మోక్షం లభించడం లేదు. ఈ ప్రాజెక్ట్ కింద దాదాపు 1500 ఎకరాల ఆయకట్టు సాగవుతుండగా కాలువలు ధ్వంసం కావడంతో చివరి ఆయకట్టుకు నీర ప్రశ్నార్థకంగా మారింది. సుమారు 25 ఏళ్ల కిందట అప్పటి మెట్‌పల్లి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చొరవతో ప్రాజెక్ట్‌కు మోక్షం లభించింది. ఈ ప్రాజెక్ట్‌ను స్థానికులు గడ్డపార చెరువుగా పిలుస్తుంటారు. ఇప్పటికి ప్రభుత్వాలు మారినా కాలువల పరిస్థితి మాత్రం అధ్వాన స్థితిలోనే ఉన్నాయి.

### రూ.1.65 కోట్లతో ప్రతిపాదనలు

దూలూరు, దుంపెట, బొమ్మెన గ్రామాల రైతులకు వరప్రదాయినిగా ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు ఏటా పుష్కలంగా నీరు వచ్చి చేరుతోంది. తుర్తి, గంబీర్‌పూర్, తాండ్ర్యాల, పోతారం, ఇప్పపల్లి అడవుల్లోంచి వరద ఉధృతి వచ్చి చేరుతుంది. కుడి, ఎడమ కాలువల్లో చెట్లు పెరిగి ఆయకట్టుకు నీరందని దుస్థితి దాపురించింది. కూలి పోయి కాలువలు పూర్తిగా ధ్వంసం కావడం వల్ల చివరి దాకా నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. తూము పూర్తిగా దెబ్బతినడంతో ఏ క్షణాన కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ అధికారులు సుమారు రూ. 6 కోట్లతో ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతానికి అత్యవసరమైన పనులకే అంచనాలు రూపొందించాలని పేర్కొనడంతో రూ. 1.65 కోట్లతో అంచనాలు తయారు చేసి సర్కారుకు నివేదించారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇరిగేషన్ ఈఎన్‌సీతో చర్చలు జరిపినట్టు సమాచారం. ఈ నిధుల విడుదల కోసం రైతాంగం ఎదురుచూస్తోంది.

### కాలువల్లో సిమెంట్ లైనింగ్ నిర్మించాలి

కొన్రెడ్డి జలంధర్‌రెడ్డి, రైతు బొమ్మెన



నా పొలం చివరి ఆయకట్టులో ఉండడంతో నీరు అందడం లేదు. వానలు అధికంగా కురిసిన సమయంలో కాలువలు దెబ్బతింటున్నాయి. కోతకు గురవుతుండడం వల్ల నీరు వృథాగా పోతోంది. ఆ సమయంలో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. పూర్తిగా కాలువల్లో సిమెంట్ లైనింగ్ నిర్మిస్తే మేలు జరుగుతుంది. అధికారులు దృష్టి సారించాలి.

## మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి


సుధాకర్‌రెడ్డి

గణేశ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కరీంనగర్‌లోని చైతన్యపురిలో సోమవారం ఉమ్మడి జిల్లా మానవ హక్కుల వేదిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, రాష్ట్ర బాధ్యులు టి.హరికృష్ణలు హాజరై ఉమ్మడి జిల్లా కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా పందిళ్ల రంజిత్, జిల్లా ఉపాధ్యక్షులుగా అజయ్ కుమార్, రమేష్‌లు, సహాయ కార్యదర్శులుగా సంపత్ కుమార్, అచ్యుత్‌లు ఎన్నికయ్యారు.

## భూ వివాదంలో ఘర్షణ

చందుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో అన్నదమ్ములు ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్న సంఘటన చందుర్తి మండలం కొత్తపేట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేటకు చెందిన పిట్టల శంకర్, పిట్టల లక్ష్మణ్ అనే అన్నదమ్ముల మధ్య దారి విషయంలో గొడవ తలెత్తింది. దీంతో ఇరువురు కర్రలతో దాడి చేసుకోవడంతో శంకర్‌కు తలకు గాయం కాగా, లక్ష్మణ్‌కు చేతికి గాయమైంది. శంకర్‌ను కరీంనగర్‌కు, లక్ష్మణ్‌ను వేములవాడలోని ఆస్పత్రికి తరలించినట్లు, ఈ సంఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించి మోసం చేశాడని ఓ యువతి కూనారంలోని ప్రియుడి ఇంటి ఎదుట సోమవారం బైఠాయించింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కునారం గ్రామానికి చెందిన జంగిటి అనిల్ తనను ప్రేమిస్తున్నానని నమ్మించి మోసం చేశాడని తనకు న్యాయం చేయాలని యువతి అనిల్ ఇంటి ఎదుట బైఠాయించింది.





చెట్ల మధ్య ఏర్పాటు చేస్తున్న మార్గం, వై జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన గజేబో, పార్కులో ఏర్పాటు చేయనున్న బెంచీలు

# ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

- రూ.కోటితో కొండగట్టు అర్బన్ పార్క్
- కొండపైన 440 హెక్టార్లలో ఏర్పాటుకు చర్యలు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- కొండపైన ఆలయ పరిసరాలు, అటవీ ప్రాంతం వీక్షించేలా ఏర్పాట్లు

మల్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదం కల్పించడానికి కొండపైన అర్బన్ పార్కు ఏర్పాటు కానుంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.కోటితో చేపట్టనున్న పనులు త్వరలోనే ప్రారంభానికి ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొండగట్టు గుట్టల్లో దేవస్థానం భూములతో పాటు అటవీశాఖకు వందలాది ఎకరాల్లో భూములున్నాయి.

కొండగట్టు అంజన్న దర్శనానికి నిత్యం వేలాదిగా, హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు వస్తుంటారు. దీంతో వారికి కొండపై మరింత ఆహ్లాదం అందించడానికి కొండపైన ఆలయ పరిసరాలు, అటవీ ప్రాంతం వీక్షించేలా కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా రూ.కోటి వ్యయంతో పలు ప్రతిపాదనలు రుపొందించారు. దాదాపు 440 హెక్టార్లలో కొండగట్టు అర్బన్ పార్కు ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందులో వైజంక్షన్ ప్రాంతం నుంచి చేపట్టే పనుల్లో భాగంగా గజేబో (సేద తీరేందుకు కూర్చునేది) నిర్మించారు. త్వరలోనే పార్కు ఏర్పాటు చేసే భూమి చుట్టూ ఫెన్సింగ్ గోడలతో పాటు ప్రవేశ ద్వారం లోపల వాచ్ టవర్, సుమారు 4కి.మీ మేర నడిచివెళ్లే మార్గం తదితరవి ఏర్పాటు కానున్నాయి. వైజంక్షన్ నుంచి దేవస్థానం ప్రధాన కార్యాలయం వెనుకాల నుంచి తాగునీటి బావి, బొజ్జపోతన ప్రాంతం నుంచి వాకర్‌ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే వీటికి టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిం చనున్నారు.

### భక్తులకు భక్తితో పాటు ఆహ్లాదం

**మొయినుద్దీన్, ఎఫ్‌ఆర్‌వో, కొడిమ్యాల**

కొండపైకి వచ్చే భక్తులకు ఆహ్లాదం పంచడానికి పార్కు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభించాము. టెండర్లు ఇతరత్రా పూర్తి కాగానే పనులు చురుగ్గా చేపట్టే అవకాశం ఉంది. దేవస్థానం పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఈ పార్కు భక్తులకు ఎంతగానో ఆకట్టుకోనుంది. ఇప్పటికే ఏర్పాటు చేసిన గజేబో ఆకట్టుకుంటోంది.


కొండపై వీక్షించడానికి ఏర్పాటు చేయనున్న వాచ్‌టవర్ నమూనా

## పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు

- కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

గోదావరిఖని, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదని, ప్రజలను దోచుకొని దాచుకున్నారని రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇస్తే బీఆర్ఎస్‌ను విలీనం చేస్తానని సోనియాగాంధీ కాళ్లు మొక్కిన కేసీఆర్ ఎన్నికల సమయంలో మోసం చేశారన్నారు. పది సంవత్సరాలు పాలించిన కేసీఆర్‌ను ప్రజలు గద్దె దించారన్నారు. కేసీఆర్ సింగరేణి కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, కొత్త బొగ్గు గనుల తవ్వకాలు, క్వార్టర్ల నిర్మాణం, సింగరేణి కార్మికులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందిస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. కోల్‌బెల్ట్‌లో పది నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను సింగరేణి కార్మికులు గెలిపించుకున్నారని చెప్పారు. 28రాష్ట్రాల్లో లేని విధంగా స్కీములను పెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని, ఆరుగ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో అనేక మంది యువకులు ప్రాణాలు బలిదానం చేశారని, వారికి ఎలాంటి భరోసా కేసీఆర్ ఇవ్వలేదన్నారు. ఏడాదిలో 50వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ నెల 4న పెద్దపల్లిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా తొమ్మిది వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి, వంగ లక్ష్మీపతి, సదానందం, వికాస్ కుమార్, వడ్డేపల్లి దాస్, పోచం, సమ్మయ్య పుట్ట రమేష్ పాల్గొన్నారు.

## 5నుంచి దళిత హక్కుల ఉద్యమ జాతీయ మహాసభలు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5 నుంచి చేపట్టనున్న దళిత హక్కుల ఉద్యమ రెండో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారత్నం పిలుపునిచ్చారు. సోమవారం కాలనీలో జరిగిన కార్యక్రమంలో మహాసభల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య వచ్చి 77 ఏళ్ళు గడుస్తున్నా సమన్యాయం చేయడంలో ప్రభుత్వాలు విఫలమైనట్టు రాజారత్నం పేర్కొన్నారు. జనవరి 5 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో జాతీయ మహాసభ జరగనుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న దళిత సంఘాల నాయకులు మహాసభలకు తరలిరావాలని రాజారత్నం పిలుపునిచ్చారు.

## అన్నదాతల్లో తుఫాన్ ఆందోళన

- మండలంలో కురిసిన చిరు జల్లులు
- ధాన్యం కుప్పలపై కవర్లు కప్పడానికి పరుగులు


వెల్గటూర్‌లో ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు

వెల్గటూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం రూపంలో చేతికి వచ్చిన పంట ఎక్కడ తుడిచి పెట్టుకొని పోతుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ ఏడాది అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తుండగా ఈసారి కోతల సమయంలో అకాల వర్షాలు లేక పోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ పంట చేతికి వచ్చి అమ్ముదామని సిద్ధం అవుతున్న వేళ తుఫాన్ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. రెండు, మూడు రోజులుగా ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. సోమవారం మండలంలో చిరు జల్లులు పడడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ధాన్యం తడువకుండా ఉండేందుకు టార్పాలిన్ కవర్లు కప్పడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పరుగులు తీశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో అక్కడక్కడా చిరు జల్లులు కురిసిన నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యాన్ని కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు.

## కల్వచర్ల రైతుకు మిలియనీర్ అవార్డు


మిలియనీర్ అవార్డు అందుకుంటున్న వేముల వెంకటేశ్వర్లు

రామగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన వేముల వెంకటేశ్వర్లు ఆదర్శ రైతు బిరుదుతో పాటు మిలియనీర్ అవార్డు సోమవారం ఢిల్లీలో అందుకున్నారు. రాష్ట్రంలో 12 మంది ఎంపికయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక కాగా అందులో పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు మిలియనీర్ అవార్డు అందుకున్నారు. జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, జాతీయ వ్యవసాయ మాసపత్రిక కృషి జాగరణ సంయుక్తంగా దేశ రాజధాని ఢిల్లీలో వ్యవసాయంపై ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విభిన్న పంటలు 18 ఎకరాల్లో సాగు చేసినందుకు గాను వెంకటేశ్వర్లుకు మిలియనీర్ అవార్డుకు అందుకున్నారు. జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అధికారుల చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. వెంకటేశ్వర్లును గ్రామస్థులు అభినందించారు.

## ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ


జమ్మికుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జమ్మికుంట, డిసెంబర్ 02 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మొలుగు చందన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. హెచ్ఐవి మన శరీరంలో రోగ నిరోధక శక్తిని తగ్గిస్తుందని, అసురక్షిత శృంగారం, కలుషిత రక్తం ఎక్కించడం, కలుషిత సిరంజీలు, సూదులు వాడటం వల్ల వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేష్‌కుమార్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చితికిన పాల వ్యాపారులు

**డెయిరీల వైపే మొగ్గు చూపుతున్న పాడి రైతులు**



హుజూరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గ్రామాల్లో ఉదయం నాలుగు గంటలకే పాల వ్యాపారులు మోటర్ సైకిళ్లపై హారన్ మోగిస్తూ రైతుల వద్దకు వచ్చి పాలు తీసుకునేవారు. నేడు అక్కడక్కడ మాత్రమే ఈ వ్యాపారులు కనబడుతున్నారు. డెయిరీలు రావడంతో పాల వ్యాపారుల బతుకులు చితికిపోయాయి. ఏళ్లుగా పాల వ్యాపారంలో ఉన్న వారు ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ప్రతి ఇంటికి రెండు ఆవులు, రెండు గేదెలు ఉండేవి. వీటిని రైతులు తమ పంట పొలాల వద్దకు మేతకు తీసుకెళ్లి మేపుతుండేవారు. ఆవు, గేదెల పాలను రాత్రి, ఉదయం పితికి వ్యాపారులకు పోసేవారు. వారు ఆ పాలను పట్టణాలకు తీసుకువచ్చి హోటళ్లు, ఇళ్లలో, హాస్టళ్లలో పోసేవారు.

ఈ క్రమంలో డెయిరీలు ఏర్పడ్డాయి. పాల వ్యాపారులు ఇచ్చే దర కంటే డెయిరీ వారు ఎక్కువగా ఇవ్వడంతో పాటు బోనస్ అందించేవారు. దీంతో రైతులు డెయిరీ వైపు మొగ్గు చూపారు. రైతులు కూడా ఆవులు, గేదెలను కొంత మంది మాత్రమే సాకుతున్నారు. వీరు డెయిరీలోనే పాలు పోస్తుండడంతో పాల వ్యాపారులు తగ్గిపోయారు. చివరికి హోటళ్ల నిర్వాహకులు పాల ప్యాకెట్లు తీసుకునే పరిస్థితి నెలకొనడంతో చాలా మంది పాల వ్యాపారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

### డెయిరీల వల్ల ఉపాధి కోల్పోయాం..

**మహేందర్, పాల వ్యాపారి, కనుకులగిద్దె**



డెయిరీలు రావడంతో మా ఉపాధి దెబ్బతింది. గతంలో గ్రామాలకు తెల్లవారు జామున వెళ్లి రైతుల వద్ద నుంచి పాలు తెచ్చుకునేవాళ్లం. రైతులకు నెల రాగానే డబ్బులు ఇచ్చేవాళ్ల. ఇప్పుడు రైతులు పాలు పోయడం లేదు. కొనేవారు లేకుండా పోయారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.



హుజూరాబాద్‌లో ఇంటింటికి తిరుగుతూ పాలు విక్రయిస్తున్న వ్యాపారులు

# వైద్య విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్
- రామగుండంలో నర్సింగ్ కళాశాల ప్రారంభం

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం నూతనంగా రూ.26కోట్లతో మంజూరు చేసిన నర్సింగ్ కాలేజీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నానని చెప్పారు. అమ్మ జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారి కష్టాన్ని వృధా చేయకుండా విద్యార్థులు శ్రద్ధగా చదివి ప్రపంచస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో అందరూ భయపడి ఇంట్లో ఉంటే వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఎందరో ప్రాణాలను కాపాడారని, దేశ, ప్రపంచంలోని జనాలకు భరోసా ఇచ్చారన్నారు. రామగుండం మెడికల్ కళాశాలలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేశామన్నారు. రామగుండం మెడికల్ కళాశాలలో పీజీ విద్యతో పాటు డెంటల్ కాలేజీ ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడానని ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. నర్సింగ్ కళాశాల బిల్డింగ్ నిర్మాణానికి ఈ నెల 4న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. మెడికల్ కళాశాల నుంచి జనరల్ ఆసుపత్రికి రాజీవ్ రహదారిపై స్కైవేను త్వరలోనే ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

- ట్రాన్స్‌జెండర్ క్లినిక్ ప్రారంభం

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక క్లినిక్‌లను ఏర్పాటు చేయగా గోదావరిఖని ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్లు వైద్యం కోసం మైత్రి క్లినిక్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, కాంగ్రెస్ కార్పొరేటర్ మహంకాళి స్వామి, ఆర్ఎంవోలు పాల్గొన్నారు.

## సైబర్ ఉచ్చులో ఆర్ఎంపీ

చందుర్తి డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన ఓ ఆర్ఎంపీ సైబర్ ఉచ్చులో పడ్డాడు. బాధితుడు కరీం కథనం ప్రకారం.. సోమవారం గుర్తు తెలియని ఓ వ్యక్తి సిబిఐ పోలీసులమంటూ ఫోన్ చేశాడు. మీ ఆధార్ కార్డుపై ముంబైలో ఫోన్ నెంబర్ తీసుకొని బ్లాక్ మనీ చలామణి చేస్తున్నారని బెదిరింపులకు పాల్పడ్డాడు. తాను ముంబైకి రాలేదు నాకు ఎలాంటి సంబంధం లేదని కరీం తెలిపాడు. తాము సీబీఐ పోలీసులం అంటూ మీ ఫోన్ నెంబర్ వాడుతున్న వ్యక్తి జైల్లో ఉన్నాడని, అతడే నీ పేరు చెప్పాడని బెదిరింపులకు పాల్పడ్డాడు. నీకు ఎన్ని బ్యాంక్ ఖాతాలు ఉన్నాయో చెప్పాలని మీ బ్యాంక్ అకౌంట్ రిజర్వ్ బ్యాంక్ ద్వారా వెరిఫై చేయాలని అకౌంట్ నెంబర్లకు డబ్బులు వేయాలని చెప్పారు. దీంతో ఆర్ఎంపీ వైద్యుడు తన ఖాతాలో నుంచి మోసగాళ్లు చెప్పిన అకౌంట్ నెంబర్లకు డబ్బులు పంపాడు. తాను మోసపోయానని గ్రహించిన ఆర్ఎంపీ కరీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# భక్తులతో కిటకిటలాడిన రాజన్న ఆలయం


వేములవాడలో ఆలయం వద్ద భక్తుల రద్దీ


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. శీఘ్రదర్శనం, ధర్మదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకొని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### రాజన్న ఆలయానికి తగ్గిన ఆదాయం

- కార్తీక మాసంలో రూ.6 కోట్ల 83 లక్షలు
- గతేడాదితో పోలిస్తే

**రూ. కోటి 56 లక్షలు తక్కువ**

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ కార్తీక మాసం ఆదాయం గతేడాది కంటే ఈ సారి భారీగా తగ్గింది. కార్తీక మాసం 1 నవంబరు 2024 నుంచి 30 నవంబరు 2024 వరకు ఆయా అర్జిత సేవల ద్వారా రూ.6 కోట్ల 83 లక్షల 58 వేల 172 సమకూరింది. గతేడాది కార్తీక మాసం 14 నవంబరు 2023 నుంచి 12 డిసెంబరు 2023 నెలకు రూ. 8 కోట్ల 39 లక్షల 97 వేల 807 ఆదాయం సమకూరింది. దీంతో గత సవంత్సరం కార్తీక మాసం కంటే ఈ సంవత్సరం రూ.కోటి 56 లక్షల 39 వేల 635 తగ్గింది.

## దుబ్బమల్లికార్జునస్వామి జాతర


ఆలయంలో పెద్దపట్నం, హాజరైన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 02 (ఆంధ్రజ్యోతి): శ్రీదుబ్బ మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సోమవారం మున్సిపల్ పరిధిలోని శ్రీదుబ్బమల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఒగ్గు పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పెద్దపట్నం, కళ్యాణం వేడుకను తిలకించారు. భక్తులతో కాసేపు ముచ్చటించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లిఖార్జునస్వామి ఆశీస్సులతో హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. మూడు నెలల పాటు జరిగే జాతర ఉత్సవాలను ఘణంగా జరుపాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్ మేడిపల్లి రవిందర్, పోడేటి రామస్వామి, పోల్నేని సత్యనారాయణ, పర్లపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

**పెద్దపల్లిటౌన్:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కల్లేపల్లి అశోక్ శ్రీ పెల్లి రవీందర్ పాల్గొన్నారు.

**సుల్తానాబాద్:** రాష్ట్రంలో టగ్ ఆఫ్ వార్ క్రీడా అభివృద్ధికి కృషి చేస్తానని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలేటి సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన సుల్తానాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. అనంతరం సంపత్‌ను రాష్ట్ర అధ్యక్షుడు ఆదర్శ మహేష్, టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఇండియా సెక్రెటరీ జనరల్ మదన్‌మోహన్ తదితరులు సన్మానించారు.

- తెలంగాణ యునైటెడ్ ఆటో డ్రైవర్స్ ఓనర్స్ అసోసియోషన్ నాన్ పొలిటికల్ జేఏసీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా సుల్తానాబాద్‌కు చెందిన ఎనగందుల నాంపల్లి ఎన్నికయ్యారు.

- సుల్తానాబాద్ ప్రాంతంలోని రైస్ మిల్లుల్లో పని చేస్తున్న మహిళా కూలీల రేట్లు వెంటనే పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. సోమవారం మహిళా కూలీల సమావేశం జరిగింది. సమావేశంలో మహిళా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

- కోడి ఎరువులను తరలిస్తున్న ట్రాక్టర్‌కు రెండు వేల చొప్పున జరిమానా విధించారు. ఎరువులను రోడ్డుపక్కన వేయ డంతో రోడ్డుపై పడిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్న కోడి ఎరువును తొలగించారు.

**కళ్యాణ్‌నగర్:** రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మహిద్ సన్ని అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

- రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి మహాలక్ష్మీ పథకంతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని జిల్లా నాన్ పొలిటికల్ జేఏసీ గౌరవ అధ్యక్షుడు గోపు ఐలయ్య అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**ముత్తారం:** యాసంగి పంటకు సాగు నీరు అందించాలని ముత్తారం మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్ట్ నుంచి గుండారం రిజర్వాయర్ ద్వారా ముత్తారం మండలం శుక్రవారంపేట్ చింతల చెరువులోకి సాగు నీరు విడుదల చేసి చివరి ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

- ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముత్తారం మండలంలోని సర్వారం, లక్కారం, మచ్చుపేట గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు ఇల్లందుల మల్లేష్ గౌడ్, బుర్ర శంకర్ గౌడ్, శైలేంద్ర రాజన్న, ఢిల్లీ, వెంకటస్వామి, కన్నూరి రేణుక, నారగోని సరిత, స్వప్న పాల్గొన్నారు.

**ధర్మారం:** మండలంలోని బొట్లవనపర్తి గ్రామంలోని రైతు వేదిక వద్ద వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహణ కార్యక్రమం ఉంటుందని ఇంచార్జ్ వ్యవసాయ అధికారి బండి ప్రమోద్‌కుమా ర్ తెలిపారు.

**పెద్దపల్లి రూరల్:** మండలంలోని నిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు ఎండీ హఫీజ్ ఆదర్శ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. త్యాగరాయ గాన సభను ఆదివారం హైదరాబాద్‌లో ఆర్ట్ ఆఫ్ లర్నింగ్ ఇంటర్నేషనల్ సంస్థ వారు ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కార్యక్రమంలో నిట్టూరు ఉపాధ్యాయుడు హఫీజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండీ హఫీజ్ దేశ సమగ్రత ఐక్యత, కులాలకు అతీతంగా ఉండే గేయాన్ని హిందీలో పాడి వినిపించి అందరి మన్ననలు అందుకోగా సంస్థవారు జ్ఞాన నంది ఆదర్శ ఉపాధ్యాయ అవార్డు అందించి సన్మానించారు.

# సీఎం బహిరంగ సభను విజయవంతం చేయండి

**- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ధర్మారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో బుధవారం జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ధర్మారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ విజయోత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దపల్లి బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని గ్రూప్-4లో ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలు అందజేయనున్నారు. లక్షమందితో నిర్వహించ బోయే ఈ సభకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

**పెద్దపల్లిటౌన్:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన క్యాంప్ ఆఫీసులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సభలో వివిధ పరీక్షల్లో ఎంపికైన తొమ్మిదివేల మంది అభ్యర్థులకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు. సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

**సుల్తానాబాద్/ఎలిగేడు/పెద్దపల్లిరూరల్/ముత్తారం:** ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని పెద్దపల్లిలో ఈ నెల నాలుగున ముఖ్యమంత్రి పాల్గొనే సభను విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ శ్రీరామ్‌నగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువశక్తి బహిరంగ సభకు మండలంలోని రైతులు, స్వశక్తి సంఘాల మహిళలు, కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎలిగేడు మండల కేంద్రంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని రైతులు హాజరుకావాలని పెద్దపల్లి మండల వ్యవసాయాధికారిణి అలివేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే యువశక్తి గళం బహిరంగ సభకు ముత్తారం మండలం నుంచి భారీ ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ పిలుపునిచ్చారు. ముత్తారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్కారు వైద్యంపై భరోసా

(5వ పేజీ తరువాయి)



ఓ వృద్ధురాలికి తుంటి ఎముక ఆపరేషన్ చేసిన వైద్యులు (ఫైల్)

అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఈ ఆసుపత్రిని 100 పడకలకు పెంచి డాక్టర్లు, సిబ్బందిని పెంచినట్లయితే రోగులను కరీంనగర్, హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు రెఫర్ చేసే పరిస్థితి ఉండదు. ఎమ్మెల్యే విజయరమణారావు చొరవ తీసుకుని పెద్దపల్లి ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలని ఈ నెల 4న జిల్లాకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుక వెళితే ప్రయోజనం ఉంటుందని వివిధ వర్గాల ప్రజలు అంటున్నారు.

**● డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు..**



**- సుప్రియ, భోజన్నపేట**

మా పాపకు జ్వరం రావడంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రికే వచ్చాం. డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండి మంచి వైద్య సేవలను అందిస్తున్నారు. ఇక్కడ రోగికి ఎంత అవసరమో అంతే మోతాదులో మందులు ఇస్తున్నారు.

**● మంచి వైద్యం అందిస్తున్నారు..**



**- శ్రావ్య, పెద్దపల్లి పట్టణం**

చలికాలం కావడంతో జ్వరం, దగ్గు బాగా వచ్చి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో మా అమ్మమ్మ ఈ ఆసుపత్రికి వైద్యం కోసం తీసుకు వచ్చింది. మూడు రోజుల నుంచి మంచి వైద్యం అందిస్తున్నారు. మొదటి రోజు చాలా ఇబ్బందిగా ఉండగా, డాక్టర్లు చేసే వైద్యం వల్ల క్రమంగా దగ్గు తగ్గుతూ వస్తున్నది.

**● సేవలను సద్వినియోగం చేసుకోవాలి..**



**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**

జిల్లాలో గల ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాం. ప్రజలు ఈ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలి. పెద్దపల్లిలో గల జిల్లా ఆసుపత్రిలో అత్యాధునికమైన పరికరాలను ఏర్పాటు చేశాం. ఆర్థోపెడిక్ విభాగం, కంటి శాస్త్ర చికిత్స విభాగం, గైనకాలజిస్టులు, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, డెంటల్ విభాగంలో గల నిపుణులైన డాక్టర్ల ద్వారా సేవలు అందిస్తున్నాము. ఫిజియోథెరపీ కూడా ఉంది. వైద్య సేవలను పెంచిన పెద్దపల్లి ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందికి అభినందనలు.

**● ఆసుపత్రిలో వైద్య సేవలు పెంచాం..**

**- డాక్టర్ శ్రీధర్, ఆసుపత్రి సూపరింటెండెంట్**

పెద్దపల్లి ఆసుపత్రిలో వసతులు పెరుగుతుండడంతో పాటు ఆధునిక పరికరాలు అందుబాటులోకి రావడంతో ఓపీ, ఇన్ పేషంట్ల సేవలు పెరిగాయి. డాక్టర్లు బాధ్యాతాయుతంగా, పారదర్శకంగా వ్యవహరించేలా కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కోసారి పడకలు సరిపోక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే బాగుంటుంది.

## విద్యార్థులకు గణిత ప్రతిభ పోటీలు



మంథనిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మంథని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ గణిత ఫోరం పెద్దపల్లి జిల్లా శాఖ అధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభ పోటీలను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. తెలుగు మీడియంలో అంజన్‌కుమార్, రశ్మిత, అభిషేక్, సంజన, సాయిచరణ్, మైత్రి, ఇంగ్లీష్ మీడియం విభాగంలో రాణా, అజయ్, మనోజ్ఞ తమ ప్రతిభను చాటి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఎంఈవో లక్ష్మి, ఎంపీఎస్‌వో హరిప్రసాద్, హెచ్ ఎం సురేష్ కుమార్ బహుమతులు అందజేశారు.

**సుల్తానాబాద్:** మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ ఆరెపల్లి రాజయ్య బహుమతులు అందించారు. కార్యక్రమంలో టీఎంఎఫ్ అధ్యక్షులు ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఎలిగేడు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు సంజన, సాద్విక, విశ్వాస్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు గంగ్ర దేవేందర్‌రావు, బిజిలి సదయ్య, టీఎంఎఫ్ మండల అధ్యక్షుడు జడల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, సీఆర్‌పీ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఓదెల:** ఓదెల మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటిస్థానంలో కనగర్తి ఉన్నత పాఠశాల విద్యార్థిని కొలిపాక గాయత్రి నిలిచింది. ఈ సందర్భంగా ఎంఈవో రాంచందర్, ప్రధానోపాధ్యాయులు రమేష్ బహుమతులు ప్రదానం చేశారు.

**ముత్తారం:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆదర్శ పాఠశాల పదోతరగతి విద్యార్థిని యు. అక్షయ ప్రథమ స్థానంలో నిలిచింది. అక్షయ జిల్లా స్థాయిలో జరిగే టెస్ట్‌కు ఎంపికైందని ఎంఈవో ఓదెలు తెలిపారు.

**ధర్మారం:** మండలకేంద్రంరలోని జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన పోటీల్లో జడ్పీ స్కూల్స్ విభాగం నుంచి 24 మంది, రెసిడెన్షియల్ స్కూల్స్ విభాగం నుంచి 12 విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జడ్పీ స్కూల్స్ విభాగం నుంచి దొంగతుర్తి పాఠశాలకు చెందిన విద్యార్థిని వి ప్రియాంక మొదటి స్థానం సంపాదించగా, ధర్మారం పాఠశాలకు చెందిన ఎ. నవ్య రెండోస్థానం, ఎం లక్ష్మి హర్షిత మూడవ స్థానంలో నిలిచారు. రెసిడెన్షియల్ విభాగం నుంచి ధర్మారం ఆదర్శ పాఠశాలకు చెందిన టి రమ్యశ్రీ మొదటి స్థానం, ఎస్ స్వాతి రెండో స్థానంలో నిలువగా, టీజీఆర్‌ఎస్ బాయ్స్ మేడారంనకు చెందిన వి రిష్విత్ మూడో స్థానలో నిలిచారు. విజేతలకు ధర్మారం ఎంఈవో పినమల్ల చాయదేవి తదితరులు సర్టిఫికెట్స్ అందజేశారు.

**అంతర్గాం:** మండల పరిధిలోని లింగా పూర్‌లో గల ఆదర్శ పాఠశాల పదోతరగతి విద్యార్థులు మండల స్థాయిలో జరిగిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచారు. జీ అనుదీప్, నియా తస్నీమ్ ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకుని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసిన గణిత ఉపాధ్యాయులు ఎస్ వెంకటస్వామి, ఎం స్వరూపలను ప్రిన్సిపల్ సదానందం అభినందించారు. సందర్భంగా విద్యార్థులు అనుదీప్, నియా తస్నీమ్‌లను పాఠశాల ప్రిన్సిపల్ పీ సదానందం, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఉద్యమకారులను ఆదుకోవాలి

**ఫోరం జిల్లా అధ్యక్షుడు ఐలయ్య**

ఓదెల, డిసెంబరు 2 ( ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య కోరారు. సోమవారం కొలనూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐలయ్య మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించామని తెలిపారు. అలాంటి ఉద్యమకారులను గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఆప్పుడు రాష్ట్రం ఇచ్చి తెలంగాణ ప్రజలకు అండగా ఉన్నది సోనియాగాంధీ అని, ప్రస్తుతం ఉద్యమకారులను కూడా ఆదుకొని అండగా ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతీ ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, 25 వేల రూపాయల పెన్షన్, బస్సు పాసులు, హెల్త్ కార్డులను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సామ రాజేందర్, వేల్పుల సదాశివు, గుండేటి శంకరయ్య, గాజుల గోపాలకృష్ణ, మాటూరి నరసయ్య, శీలం మల్లారెడ్డి, బేరం సదయ్య, రాజయ్య, గుండేటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## 'ఖని'లో రక్తదాన శిబిరం

మార్కండేయకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా రామగుండం కార్పొరేషన్ ముస్లీం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గోదావరిఖని గాంధీనగర్‌లోని నురాని అరబిక్ స్కూల్‌లో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో సుమారు 100 మంది యువకులు దరక్తదానం చేయగా ఇండియన్ రెడ్ క్రాస్‌సొసైటీ రక్తాన్ని సేకరించింది. ఈ కార్యక్రమానికి ఆర్గనేజేషన్ షేక్ హాజీ అలీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, తల్లిదండ్రులు జన్మనిస్తే రక్తదానం పునర్ జన్మనిస్తుందన్నారు. కుల మతాలకు అతీతంగా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభుయలు మీర్ జాకీర్ అలీ, సయ్యద్‌జానీ, బాజీ, మొబిన్ హుస్సేన్, మొయిన్, మున్వర్, షానవాజ్, రియాజ్ బేగ్, ఖాసీం, షరీఫ్, ల్యాఖత్, మీర్ ఫయాజ్ అలీ, తాజ్, టిప్పు, అఫ్జల్, రహ్మాద్ తదితరులు పాల్గొన్నారు.

## అమావాస్య పొద్యమి ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆమావాస్య పొద్యమి రోజును పురస్కరించుకుని సుల్తానాబాద్ శివాలయంలో మహిళలు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసంలో ముప్పై రోజులు వేకువజామున పూజల అనంతరం కార్తీక మాసం ముగిసిన ప్రథమ రోజును మార్గశిర మాసం ఆరంభంలో ఆమావాస్య పొద్యమికి ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆ మేరకు ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు తమ ఇంటి వద్ద కొందరు, మండలంలోని మానేరు నది పరివాహక ప్రాంత గ్రామాల్లోని తీరంలో కొందరు దీపాలు వెలిగించి శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు.

## రాష్ట్రంలో కొనసాగుతున్న నిర్బంధ పాలన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో నిర్బంధ పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురుకుల బాట కార్యక్రమంలో భాగంలో సోమవారం స్థానిక మైనార్టీ హాస్టల్ పాఠశాలను సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థుల పరిస్థితి తెలుసుకునేందుకు వస్తే పాఠశాల అధికారులు అనుమతులు లేవంటూ మాట్లాడుతున్నారని ఇది దుర్మార్గపు పాలనకు నిదర్శనమన్నారు. ఇప్పటికి వరకు 48 మంది గురుకుల విద్యార్థులు మృతి చెందారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు అచ్చే వేణు, నారాయణదాసు మారుతి, చుక్క శ్రీనివాస్, సట్టు శ్రీనివాస్, బొడ్డు రవీందర్, జడ్సన్, శ్రావణ్, కిరణ్, రామారాజు, వెంకటేష్, చింటు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నగదు రహిత లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలి

మంథని, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగదురహిత లావాదేవీలపై అందరూ అవగాహన పెంచుకోవాలని మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పుట్టపాక గ్రామంలో మంథని కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత-నగదు రహిత లావాదేవీలపై సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత రైతులు, ప్రజల ఆర్థిక జీవవ ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సహకార సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ మేనేజర్ ఉదయశ్రీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డీఈ దిలీప్ పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లేలా పాలన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

రామగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లేలా పరిపాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజావంచన దినాల్లో భాగంగా సోమవారం మండలంలోని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పేరుతో దగా చేసిన రేవంత్ సర్కార్ సంక్రాంతికి రైతు భరోసా ఇస్తామంటూ ముందుస్తుగా రైతు సంబరాలు చేసుకోవడం సరికాదన్నారు. విద్యాభరోసా కింద ఐదు లక్షల రూపాయల కార్డులు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఐదు రూపాయలు కూడా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, నాయకులు మేదరవేన కుమార్‌యాదవ్, కాపురబోయిన భాస్కర్, శ్రీదేవి, స్టాలిన్, అశోక్, రాజన్న, ఉదయ్, కుమారస్వామి, కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.




### విశ్రాంత ఉద్యోగులు జీవన ప్రమాణ పత్రం అందజేయాలి

రామగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు విధిగా జీవన ప్రమాణ పత్రం అందజేయాలని ఆర్జీ-3 పర్సనల్ మేనేజర్ సుదర్శనం సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కోల్‌మైన్ పెన్షన్ స్కీం కింద పించన్ పొందుతున్న వారు, కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీమ్ కింద వైద్యసేవలు పొందుతున్న సింగరేణి విశ్రాంత కార్మికులు తప్పనిసరిగా జీవన ప్రమాణ పత్రం అందజేయాలని సూచించారు.

### 6న సింగరేణి ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం

ఫైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీన ఆర్జీ-2 వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఏరియా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సీఈఆర్ క్లబ్‌లో ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దివ్యాంగులు బాల్ ఇన్ బాస్కెట్, పరుగు పందెం, మ్యాజికల్ ఛైర్, బాల్ త్రో, లాంగ్ జంప్ పోటీలు ఉంటాయన్నారు. ఏరియా పరిధి పరిసర ప్రాంతాల్లో ఉండే దివ్యాంగులు ఆరో తేదీ ఉదయం 9 గంటలకు జరిగే పోటీల్లో పాల్గొనాలని అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

### రికవరీ చేసిన యూజీ అలవెన్స్‌లు ఇప్పించాలి

ఫైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వకీల్‌పల్లె గని కార్మికులకు రికవరీ చేసిన అండర్ గ్రౌండ్ అలవెన్స్‌లు ఇప్పించాలని కోరుతూ సోమవారం ఏఐటీయూసీ పిట్ కమిటీ నాయకులు మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏడాదిన్నర క్రితానికి సంబంధించి 579 మంది కార్మికులకు 5,376 మస్టర్లకు సంబంధించిన అండర్ గ్రౌండ్ అలవెన్స్‌లను ఆడిట్ తర్వాత రికవరీ చేసినట్టు పిట్ సెక్రెటరీ బొంత రాజు తెలిపారు. అండర్ గ్రౌండ్ కార్మికులను కంపెనీ అవసరాల నిమిత్తం సర్ఫేస్‌లో విధులకు కేటాయించారని, సర్ఫేస్‌లో పని చేసిన కార్మికులకు అండర్ గ్రౌండ్ అలవెన్స్‌లు కోత విధించడం సరికాదన్నారు. రికవరీ అయిన మొత్తాన్ని కార్మికులకు చెల్లించేలా చూడాలని మేనేజర్‌ని కోరారు. జీఎం దృష్టికి తీసుకెళ్లి రికవరీ అయిన మొత్తాన్ని తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకుంటమని మేనేజర్ హామీ ఇచ్చారు. బ్రాంచి ఆర్గనైజింగ్ సెక్రెటరీలు మామిడి మహేందర్, బొట్ల సంపత్, పిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# త్వరలోనే కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం

**ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్**



సమావేశంలో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల చిరకాల వాంఛ అయిన కార్మికుల సొంతింటి కల, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ మాఫీపై ప్రభుత్వంతో మాట్లాడామని త్వరలోనే, ఆచరణలోకి వస్తుందని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, కనీస వేతన సలహామండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ అన్నారు. సోమవారం జీడీకే 11ఇంక్లైన్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ముఖ్యంగా కార్మికుల కృషి వల్ల ఎన్నడూ లేనివిధంగా సింగరేణిలో అత్యధిక ఉత్పత్తి, ఉత్పాదకత, లాభాలు గడించిందని, ప్రభుత్వం కూడా సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగుల వయోపరిమితి 35ఏళ్ల నుంచి 40ఏళ్లకు పెంపు, రామగుండంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, 800 మెగావాట్ల పవర్ ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. సింగరేణి కార్మికులకు గతంలో కన్నా ఎక్కువ లాభాలు ఇవ్వటంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల్లో నుంచి ఐదు వేల రూపాయలు ఇప్పించామన్నారు. అలాగే భవిష్యత్‌లో కూడా రామగుండంలో 1000 క్వార్టర్లతో గేటెడ్ కమ్యూనిటీ తరహా నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ నెల 4న పెద్దపల్లిలో జరిగే ముఖ్యమంత్రి సభలో సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్జీ-1 వైస్ ప్రెసిడెంట్ సదానందం, సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి, ధర్మపురి, జనరల్ సెక్రటరీలు వంగ లక్ష్మిపతిగౌడ్, వికాస్‌కుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి దాస్, నాయకులు లింగస్వామి, నాయకులు పాల్గొన్నారు.

## మారుపేర్ల సమస్యలను పరిష్కరించాలి

గోదావరిఖని, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మారుపేర్ల సమస్యలను పరిష్కరించాలని లక్క శ్రావణ్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజిలెన్స్ ఎంక్వైరీ పేరుతో తమను పక్కన పెట్టారని, తమకు డిపెండెంట్ ఉద్యోగం వస్తే మారు పేర్లు ఉన్నాయంటూ ఉద్యోగాలను నిలిపివేయడంతో తాము షాపుల్లో పనిచేస్తూ జీవనం కొనసాస్తున్నామన్నారు. పెద్దపల్లికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి మారుపేర్ల సమస్యను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తీసుకెళ్లాలని వారు కోరారు. విలేకరుల సమావేశంలో తిరుమల, శ్రీనివాస్, హరీష్, వెంకటేష్, కార్తీక్, రంజిత్, శ్రావణ్, వెంకటి, రమేష్ పాల్గొన్నారు.

## హామీలను ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలి

గోదావరిఖని, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్, హెచ్‌ఎంఎస్ నాయకుడు రాంచందర్, ఏఐఫైఎఫ్‌టీయూ నాయకుడు రాములు డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా సింగరేణి ప్రాంతంలో తిరిగిన రేవంత్‌రెడ్డి వారికి ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలన్నారు. పదవీవిరమణ పొందిన కార్మికులకు 250గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జైపాల్‌సింగ్, రాజేందర్, ఐ కృష్ణ, మొండయ్య, ఈదునూరి నరేష్, రవికుమార్, శేఖర్, మల్లేషం పాల్గొన్నారు.

## భగవద్గీత ప్రతీఒక్కరి జీవితంలో భాగం కావాలి

పెద్దపల్లి కల్చరల్/పెద్దపల్లి టౌన్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత ప్రతీ ఒక్కరి జీవితంలో భాగం కావాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్ కిరణ్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్య వైశ్యభవన్‌లో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల నిర్వహణ, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో స్వరూప్ కిరణ్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. సనాతన ఆధ్యాత్మికతే హిందువులను ఒక్కటి చేసే తారకమంత్రమని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అత్యాచారాలు, మారణహోమం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, భారత ప్రభుత్వం బంగ్లాదేశ్‌లోని హిందువులకు అండగా ఉండేలా సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీ హిందువు భగవద్గీతను తప్పనిసరిగా చదవాలని, ప్రతీ ఒక్కరి జీవితంలో భగవద్గీతను భాగం చేసుకోవాలని సూచించారు. భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో పాల్గొన్న ప్రతీ విద్యార్థి మేధస్సు అమోఘమని కొనియాడుతూ ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు నగదు ప్రోత్సాహకాలను అందించారు. జిల్లాలోని 22 పాఠశాలలకు చెందిన 130మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం, ప్రఖండ ఉపాధ్యక్షుడు ఆనరి రమేష్, ప్రఖండ సత్సంగ ప్రముఖ్ బొమ్మకంటి రవి, మురళిమోహన్, రాజేందర్, తిరుమల, తారాబాయి, కవితక్క, వేదశ్రీ పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు తొలగించండి

కోల్‌సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో ప్రభుత్వం ఇటీవల తిరిగి స్వాధీనం చేసుకున్న జనగామ శివారు సర్వే నంబర్ 683లోని ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చేయాలని, నిర్మాణాలను తొలగిచాలంటూ రామగుండం తహసీల్దార్ కుమారస్వామి నోటీసులు జారీచేశారు. వేముల అశోక్ ఐదు గుంటల స్థలం ఆక్రమణలో ఉన్నాడని, ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ యాక్ట్ 1905 ప్రకారం వీటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.

## కళా ఉజ్వల పోస్టర్ ఆవిష్కరణ

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుమ్మడి ఉజ్వల ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ నృత్య శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కళా ఉజ్వల కార్యక్రమం పోస్టర్లను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆవిష్కరించారు. సోమవారం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళా ఉజ్వల పోస్టర్ల ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో కూచిపూడి నృత్య శిక్షణ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని, ప్రభుత్వ పరంగా సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.